

రైతుకు వి'పత్తి'

వైరస్ సోకి లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతి నింది. దిగుబడి పూర్తిగా తగ్గి పెట్టుబడులు కూడా రాని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. 8లో▸



.. చదువుకునేదెట్టా!

మధ్యాహ్న భోజనం అరకొరగా పెడుతున్నారని, ఇలాగైతే పిల్లలు ఎలా చదవాలని, టీసీలు ఇవ్వాలని ఎంఈఓకు విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం ఇచ్చారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 79.798
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 50,122
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 45,772

న్యూస్‌రీల్

బొలెరో విరాళం



ఈఓకు వాహన తాళాలు అందజేస్తున్న ఏపీజీబీ బ్యాంకు చైర్మన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శ్రీశైలం శాఖ మహేంద్ర బొలెరో వాహనాన్ని విరాళంగా సమర్పించింది. శనివారం గంగాధర మండపం వద్ద వాహనం, సంబంధిత పత్రాలను బ్యాంకు చైర్మన్ పీవీకే ప్రమోద్‌కుమార్‌రెడ్డి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుకి అందజేశారు. ముందుగా అర్చకులు వాహన పూజలు నిర్వహించారు. సుమారు రూ.11.50 లక్షలతో కొనుగోలు చేసిన ఈ వాహనాన్ని దేవస్థానానికి అందజేసినట్లు ఏపీజీబీ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ పీవీ రమణ, శ్రీశైలం బ్రాంచ్ మేనేజర్ కె.సుబ్రమణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

జీఎన్ఎం కోర్సులకు నోటిఫికేషన్

కర్నూలు(హాస్పిటల్): జీఎన్ఎం(జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరి) కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. కోర్సులో చేరాల్సిన వారు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతలు, వయోపరిమితి, దరఖాస్తు విధానం, సీట్ల లభ్యత వంటి వివరాలు నోటిఫికేషన్‌లో ఉంటాయన్నారు. దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రిలోని కార్యాలయంలో స్వీకరిస్తారన్నారు.

పీఆర్‌లో ఐదుగురు డీడీఓలకు పోస్టింగ్స్

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఎంపీడీఓలుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి ఇటీవల పదోన్నతులు కల్పించారు. జిల్లాలోని గూడూరు ఎంపీడీఓ అశ్వినీకుమార్‌ను ప్రకాశం జిల్లా డ్వామా డీపీఓగా, ఓర్వకల్ ఎంపీడీఓ ఎం.శ్రీనివాసులును నంద్యాల జిల్లా డ్వామా ఏపీఓ (అకౌంట్స్)గా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే అనంతపురం జిల్లా గోరంట్లలో విధులు నిర్వహిస్తున్న పి.నరేంద్రకుమార్‌ను నంద్యాల డ్వామా ఏపీడీగా, విడపనకల్‌లో విధులు నిర్వహిస్తున్న షకీలాబేగంను డ్వామా డీపీఓగా, గాండ్లపెంటలో విధులు నిర్వహిస్తున్న బి.వెంకటరాముడును ఆత్మకూరు డ్వామా ఏపీడీగా పోస్టింగ్ ఇచ్చారు.



డోన్ పట్టణంలో ఓ ఆర్ఎంపీ క్లినిక్ వద్ద చికిత్స కోసం జ్వర బాధితులు

ఇంటింటా జ్వరాలు

- వైరల్ ఫీవర్‌తో విలవిల్లాడుతున్న జనం
- బాధితులతో ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలలు కిటకిట
- దోచుకుంటున్న ప్రైవేటు ఆసుపత్రులు



ప్రభుత్వాసుపత్రిలో వైద్యం కోసం వేచివున్న రోగులు



గోసానిపల్లెలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

డోన్: ప్రైవేటు క్లినిక్‌లు, పీహెచ్‌సీలు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఏ మెడికల్ షాపు వద్ద చూసినా జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పుల బాధితులు మాత్రలు కొనుగోలు చేస్తున్నారు. డోన్ నియోజకవర్గంలో ఇంటికి ఒకరు, ఇద్దరు జ్వరం బారిన పడ్డారు. డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రితో పాటు ప్యాపిలి, జలదుర్గం, కొత్తబురుజు, రంగాపురం, బేతంచెర్ల పీహెచ్‌సీలకు వస్తున్న రోగుల్లో 70 శాతం మంది జ్వర పీడితులే ఉంటున్నారు. వాతావరణంలో మార్పులతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుద్ధ్యం లోపించి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరపీడితుల్లో అత్యధిక శాతం చిన్నపిల్లలు ఉంటున్నారు. ముఖ్యంగా నిరుపేద, మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా ఉండే ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీలు, ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు డెంగీ బూచీతో దోచుకుంటున్నారు. జ్వరంతో వస్తే చాలు డెంగీ, మలేరియా టెస్ట్‌లు అంటూ ల్యాబ్‌లకు పంపి సొమ్ము చేసుకుంటున్నారు.

డెంగీ లక్షణాలతో ఆసుపత్రులలో చికిత్స

కోవెలకుంట్ల: ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలతో చోటు చేసుకున్న వాతావరణ మార్పులతో కోవెలకుంట్ల మండలంలో విష జ్వరాలు ప్రబలాయి. మేజర్ గ్రామ పంచాయతీతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో నిల్వ చేరిన నీటిలో దోమలు వృద్ధి చెందటంతో జ్వరాలు వ్యాప్తి చెందినట్లు తెలుస్తోంది. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 100 మందికి పైగా జ్వరాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో కొందరు డెంగీ లక్షణాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



వైరల్ జ్వరానికి సంబంధించిన వైరస్ ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి సులువుగా సోకే ప్రమాదం ఉంది. హైగ్రేడ్ జ్వరం, తల, గొంతు, కీళ్లు, కండరాల, కడుపు నొప్పితో పాటు జలుబు చేసి ముక్కు కారడం వైరల్ జ్వరానికి ముఖ్య లక్షణాలు. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి సకాలంలో రక్తపరీక్షల ద్వారా రోగనిర్ధారణ చేసి సరైన చికిత్స అందించాలి.

– డాక్టర్ రమ్యశిల్ప, గైనకాలజిస్ట్, వంద పడకల ప్రభుత్వాసుపత్రి, డోన్

రక్త పరీక్షలు చేయించుకోవాలి



ఏటా ఆగస్టు నుంచి మూడు నెలల పాటు వాతావరణంలో వచ్చే అనూహ్య మార్పులు వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు ప్రధాన కారణం. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యాల నిర్ధారణ కోసం రోగికి రక్తపరీక్ష చేయాల్సి ఉంటుంది. సకాలంలో ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను సంప్రదించి వైద్య చికిత్స అందిస్తే వైరల్ ఫీవర్‌ను తగ్గించవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ మాధవ కృష్ణ, చిన్నపిల్లల వైద్యులు, అసోసియేట్ ప్రొఫెసర్, నంద్యాల జిల్లా ఆసుపత్రి

యాంటి వైరల్ ఇంజెక్షన్ వేయించాలి



ఈ సీజన్‌లో ముఖ్యంగా చిన్నారులకు యాంటి బయాటిక్ బదులు యాంటి వైరల్ ఇంజెక్షన్ వేయించాలి. రోగనిరోధక శక్తి తగ్గిపోకుండా సమతుల్యమైన ఆహారాన్ని ఇవ్వడం, అధికంగా నీరు తాగించాలి. నాటు వైద్యం, సొంత వైద్యం జోలికెళ్లొద్దు. ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు.

– కళ్యాణ్‌బాబు, చిన్నపిల్లల వైద్యులు, వందపడకల ప్రభుత్వాసుపత్రి, డోన్

నేడు శ్రీశైల ఆలయం మూసివేత

- చంద్ర గ్రహణం కారణంగా ఉభయ దేవాలయాలు మూసివేత



శ్రీశైలంటెంపుల్: చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సోమవారం వేకువజామున 5 గంటల వరకు ఆలయ ద్వారాలు మూసివేస్తున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఈఓ మాట్లాడుతూ చంద్రగ్రహణం ఆదివారం రాత్రి 9.56 గంటలకు ప్రారంభమై రాత్రి 1.26 గంటలకు ముగుస్తుందన్నారు. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మల్లికార్జున స్వామివారి స్పర్శదర్శనం, అన్ని ఆర్జితసేవలు, పరోక్షసేవలు, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం పూర్తిగా నిలుపుదల చేయబడుతుందన్నారు. ఆ రోజున భక్తులందరికీ అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుందని అన్నారు. అలాగే సాక్షిగణపతి, హఠకేశ్వరం, పాలధారా పంచధారా, శిఖరేశ్వరం మొదలైన పరివార ఆలయాల ద్వారాలను కూడా మూసివేయడం జరుగుతుందని అన్నారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ జరిపించిన తరువాత శ్రీస్వామిఅమ్మవార్లకు ప్రాతఃకాల పూజలు చేపడుతారన్నారు. అనంతరం 7.30 గంటలకు స్వామి అమ్మవార్లకు మహా మంగళహారతులు నిర్వహించిన తర్వాత ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 గంటల వరకు భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం కల్పిస్తారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు ఆయా సమయ వేళల మార్పులను గమనించి దేవస్థానానికి సహకరించాలని దేవస్థాన ఈఓ పేర్కొన్నారు.

చంద్రబాబు మొద్దు నిద్ర వీడాలి

- రైతులు రోడ్డెక్కుతున్నా కూటమి ప్రభుత్వానికి చలనం లేదు
- యూరియా కోసం పడిగాపులు కాస్తున్నా పట్టించుకోరా?
- జగనన్న పాలనలోనే రైతు సంక్షేమం
- ఈ నెల 9న అన్నదాత పోరు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి





అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

కల్లూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొద్దు నిద్ర వీడి రైతుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలను దగాకు గురి చేస్తుందన్నారు. శనివారం సాయంత్రం తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ నెల 9వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9వ తేదీన చేపట్టే అన్నదాత పోరులో భాగంగా నంద్యాల బొమ్మల సత్రం లోని వి.మార్ట్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రైతులతో ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తామన్నారు. రాష్ట్రంలో యూరియా, ఎరువుల కోసం రైతులు కొన్ని నెలలుగా అవస్థలు పడుతున్నా కూటమి ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. రైతులు ఎరువులు కోసం క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసలు మంత్రి పదవిలో కొనసాగేందుకు అర్హుడేనా? అన్ని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రికి భోజనం గుర్తుకు రావడం దౌర్భాగ్యమన్నారు.

కూటమి నేతల ఎరువుల దందా

కూటమి నేతలు కృత్రిమ కొరత సృష్టిస్తూ రూ. 270 ఉన్న యూరియా బస్తాను రూ. 450 నుంచి 600 వరకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఒక్కో బస్తా మీద రూ. 200 నుంచి 300 వరకు రైతుల నుంచి దోచుకుంటున్నారన్నారు. ఎరువులను టీడీపీ నాయకులే దారి మళ్లించి అధిక ధరకు అమ్ముకుంటున్నారన్నారు. కూటమి ప్రభు త్వం ఉచిత పంటల బీమాకు పాతరేసిందన్నారు. రైతులకు అందిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం ఇవ్వడం లేదని విమర్శించారు. రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తివేసిందన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రేణుక, పార్టీ మహిళ జోనల్ విభాగం అధ్యక్షురాలు గాజుల శ్వేతారెడ్డి నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కేవీ రమణారెడ్డి, కల్లూరు ఎంపీపీ శారద, పలువురు కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రైతుకు అండగా నిలిచిందని కాటసాని అన్నారు. ఏనాడు రైతులు ఎరువులు, పంటల గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రైతులు రోడ్ల పైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతుల కోసం ఉచిత విద్యుత్ తీసుకువస్తే ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు ఇబ్బందులు పడకూడదని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను నిర్మించారని గుర్తు చేశారు. కరోనా మహమ్మారి ప్రభావంతో చీని రైతులు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వమే కొనుగోలు చేసి వారికి అండగా నిలిచిందన్నారు. ప్రస్తుతం చీని పంట టన్ను రూ. 6 వేల నుంచి 12 వేలు మాత్రమే ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టన్ను చీని ధర కనిష్టంగా రూ. 30 వేలు గరిష్టంగా రూ. లక్ష వరకు రైతులకు లభించిందన్నారు. అతివృష్టి, అనావృష్టి కాలంలో రైతుల ఉపయోగం కోసం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయగా నేడు కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టిందన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై పోలీసుల జులుం

- స్టేషన్‌కు పిలిపించి చితకబాదిన సీఐ
- పోలీసు స్టేషన్ ఎదుట కుటుంబీకుల ఆందోళన



ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వార్డు కౌన్సిలర్ కలిములా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



చేతిపై ఉబ్బిన గాయం



సీఐ చితకబాదడంతో గాయాలు చూపుతున్న ఖాదర్‌బాషా

ఆత్మకూరు: చిన్న కేసు విషయంలో రాజీ అంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తను స్టేషన్‌కు పిలిచి సీఐ చితకబాదిన ఘటన ఆత్మకూరు పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు, అతని కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు పట్టణానికి చెందిన మాసుంబాషా అనే వ్యక్తి మన్సూర్‌కు రూ.10 వేలు బదులిచ్చాడు. రెండు రోజుల్లో ఇస్తానని పది నెలలు గడిచినా ఇవ్వకపోవడంతో శుక్రవారం రాత్రి వారి మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో అక్కడే వున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త, వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ కలిముల్లా కుమారుడు ఖాదర్‌బాషా వారికి సర్ది చెబుతుండగా తోపులాట జరిగింది. దీంతో మన్సూర్, ఖాదర్‌బాషా తనపై దాడి చేశారని మాసుంబాషా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఖాదర్‌బాషాను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. సీఐ రాము అతడి నుంచి ఘర్షణ వివరాలు తెలుసుకుంటూ చితకబాదినట్లు తెలుస్తోంది. తాను వైఎస్సార్‌సీపీ కార్యకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా మనిషి కావడంతోనే సీఐ కొట్టాడని తాను కుటుంబీలకు చెప్పాడు. ఇది అన్యాయమంటూ ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆవేదన చెందాడు. దీంతో అతని తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ సభ్యులు కలిముల్లా, షఫీవున్‌లు, కుటుంబీకులు, పార్టీ శ్రేణులతో కలసి పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడితే సర్ది చెప్పిన వ్యక్తిపై ఎలా దాడి చేస్తారని మండిపడ్డారు. సీఐ రాముపై చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత వెల్లడిస్తామని ఆందోళన విరమించాలని కోరడంతో వారు శాంతించారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా

ఆత్మకూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ కలిముల్లా కుమారుడు ఖాదర్‌బాషాపై జరిగిన దాడిపై ఆదివారం కూడా ధర్నా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి తెలిపారు. పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు. సీఐ రాము తమ పార్టీ కార్యకర్తను చితకబాదడం అన్యాయమన్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళ చేస్తామన్నారు.

పోలీసు శాఖకు నూతన 'హంటర్'



నూతన డాగ్ హంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్

కర్నూలు: కేసుల ఛేదన, నేరస్తులను గుర్తించడంలో జిల్లా పోలీసు శాఖ మరింత బలోపేతమయ్యేందుకు ప్రభుత్వం నూతన జాగిలాన్ని పంపింది. మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆరో బెటాలియన్‌లో పది నెలల పాటు పేలుడు పదార్థాలపై ఈ కొత్త డాగ్ హంటర్ శిక్షణ పొంది శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుంది. ఇప్పటివరకు పోలీసు శాఖలో 8 జాగిలాలు ఉండగా హంటర్ రాకతో ఆ సంఖ్య తొమ్మిదికి చేరింది. ఇది బెల్జియం మలనాయిస్ జాతికి చెందినది. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నూతన జాగిలాన్ని పరిశీలించారు. వాటి సంరక్షణపై డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో జాగిలాలు కీలకపాత్ర పోషిస్తున్నందున వాటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జావెద్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఏఆర్ కానిస్టేబుల్ రాజు, డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ కానిస్టేబుల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకెన్నాళ్లు.. గోస్పాడు మండలం పసురపాడులో బారులుదీరిన రైతులు



పడిగాపులు.. పగిడ్యాల సహకార సొసైటీ వద్ద..



నిరీక్షణ: రుద్రవరం మండలం పేరూరులో యూరియా కోసం గుంపులుగా ఉన్న రైతులు

కళ్లు కాయలు కాసేలా.. కాళ్లు అరిగేలా..

నంద్యాల జిల్లాలో ఎరువుల కొరతకు నిదర్శనం ఈ దృశ్యాలు. కూటమి ప్రభుత్వం రైతులను రోడ్డున పడేసింది. వ్యవసాయ పనులు చేసుకుంటూ పంటను కాపాడుకోవాల్సిన సమయంలో ఎరువుల కోసం రైతు సేవా కేంద్రాలు, సొసైటీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాచేలా చేస్తోంది. నెల రోజులుగా యూరియా కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా రెండు బస్తాలు కూడా అందడం లేదు. – సాక్షి నెట్‌వర్క్



పోలీసు పహారాలో.. జూపాడుబంగ్లా మండలం తాటిపాడు ఆర్ఎస్‌కేలో పోలీసు బందోబస్తు మధ్య..



మహానంది మండలం తిమ్మాపురంలో పోలీసుల సమక్షంలో కూపన్లు ఇస్తున్న అధికారులు



ఎరువు..బరువు: పాణ్యం మండలం పెసరవాయిలో బస్తా మోసుకెళ్తున్న రైతులు





యూరియాతన .. వెలుగోడు మన గ్రోమోర్ కేంద్రం వద్ద గుమికూడిన రైతులు, (ఇన్‌సెట్‌లో) **ఆగ్రహం:** అవుకు ఆర్ఎస్‌కే వద్ద వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల వాగ్వాదం

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్ల మెంటరీ రాష్ట్ర కార్యదర్శులను నియమించింది. నియమితులైన వీరు పార్టీ కేంద్ర కార్యాలయం తో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజ నల్ కోఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిం చాలని పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది.

కర్నూలు జిల్లాలో..

పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శులుగా తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, మొలగవల్లి మహేంద్రనాథ్ రెడ్డిని నియమిం చారు. ఎమ్మిగనూరు, పత్తికొండ అసెంబ్లీ నియో జకవర్గాలను తెర్నెకల్ సురేందర్‌రెడ్డి , మంత్రాల యం, ఆదోని అసెంబ్లీ నియోజకవర్గాలను ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, కళ్యాణదుర్గం, పాణ్యం సెంబ్లీ నియోజకవర్గాలను మొలగవల్లి మహేంద్రనాథ్ రెడ్డి పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

నంద్యాల జిల్లాలో

పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శులుగా గుండం సూర్యప్రకాష్ రెడ్డి, కర్రా హర్షవర్ధన్ రెడ్డిని నియ మించారు. శ్రీశైలం, ఆలూరు అసెంబ్లీ నియో జకవర్గాలను గుండం సూర్యప్రకాష్ రెడ్డి , కర్నూలు, కోడుమూరు అసెంబ్లీ నియోజకవ ర్గాలను కర్రా హర్షవర్ధన్ రెడ్డి పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

నేడు 'కవితా (వి) హారం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత కేపీఆర్ శర్మ రచించిన 'కవితా (వి) హారం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు వీఆర్ కాలనీలోని సాయి రాఘవ రెసిడెన్సీలో జరు గుతుందని నిర్వాహకులు తెలిపారు. తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ డాక్టర్ రాధాశ్రీ, విశ్రాం త ఆర్ఐఓ రంగనాథ శర్మ, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ కల్యాణ శాస్త్రి అతిథులుగా హాజరు కాను న్నారని పేర్కొన్నారు. రచయిత్రి డాక్టర్ కర్నాటి చం ద్రమౌళిని పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు.

రైతుకు వి'పత్తి'

- వైరస్ సోకి ఎండిపోతున్న పత్తి పొలాలు
- లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- పూర్తిగా తగ్గనున్న దిగుబడి
- పెట్టుబడులు కూడా రాని దుస్థితి



బాపనదొడ్డి సమీపంలో వైరస్ సోకిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కృష్ణగిరి: కొన్ని రోజులు వర్షాలు లేకపోవడం.. ఉన్న ట్టుండి వానలు భారీగా పడటంతో పత్తి పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వైరస్ సోకి ఎర్రగా మారాయి. లక్షల ఎకరాల్లో పంట దెబ్బతినింది. దిగుబడి పూర్తిగా తగ్గి పెట్టుబడులు కూడా రాని దుస్థితి నెలకొంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు ఉండగా.. అత్యధికంగా 2,19,636 హెక్టార్లలో పత్తి సాగైంది.

పంటంతా ఎర్రగా మారి..

గతేడాది వేరుశనగ సాగు చేయగా దిగుబడులు అం తంత మాత్రంగా వచ్చాయి. దీంతో ఈ యేడాది రైతులు అధికంగా పత్తి వైపు మొగ్గు చూపారు. మే నెల చివరల్లో కురిసిన వర్షాలకు చాలా మంది విత్తనం వేశారు. అలాగే జూన్ నెలలో కూడా లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఆశించిన మేర వర్షాలు పడటంతో పంట ఏపుగా వచ్చి కాయలు వచ్చాయి. అయితే జూలై నెలంతా బెట్ట రావడంతో పంట ఎం డుపోయే దుస్థితికి వచ్చింది. ఈ సమయంలో ఆగస్టు నెలలో ఒక్కసారిగా భారీ వర్షాలు రావడంతో ఏపుగా వచ్చినట్లు వచ్చిన పత్తి పంటకు వైరస్ సోకింది. పం టంతా క్షణాల్లో ఎర్రగా మారింది.



రామకృష్ణాపురం సమీపంలో వైరస్ సోకి ఎండిపోతున్న పత్తి పంట

పెట్టుబడి మట్టిపాలు

ఇంటికి తెల్లబంగారం(పత్తి) వస్తుందని ఆశించిన రైతులకు కన్నీరే మిగిలింది. అధిక వర్షాలతో జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పత్తి దెబ్బతినడంతో కోట్ల రూపాయల పెట్టుబడి మట్టిపాలైంది. విత్త నాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు తదితర వాటి కింద ఎకరాకు రూ. 40వేల వరకు ఖర్చు చేశారు. ఎర్ర, నల్లరేగడి భూముల్లో సాగు చేసిన పత్తి పంట కాయ దశకు వచ్చే సమయానికి వైరస్ సోకింది. పంట ఎర్రగా మారి ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా అందని స్థితిలో ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది కూడా ఇదే తెగులు రావ డంతో కనీస దిగుబడి కూడా అందలేదని, రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



గతేడాది పొగాకు సాగు చేశాం. మంచి దిగుబడి వచ్చినా మద్దతు ధర లేక చాలా నష్టపోయా. ఈ ఏడాది నాకున్న ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగుచేశా. కాయదశకు వచ్చే సరికి వర్షాలు అధికంగా రావడం తో తేమ అధికమై పంటకు వైరస్ సోకి ఎర్రగా మారింది. ఎకరాకు రూ. 40వేల ప్రకారం రూ.3 లక్షల పెట్టుబడులు పెట్టా. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. రైతులకు పరి హారం అందించి ఆదుకోవాలి. –బజారి, పత్తి రైతు, ఎస్‌హెచ్ ఎర్రగుడి

పెట్టుబడులు కూడా రావు



నాకున్న 15 ఎకరాల్లో పత్తి సాగుచేశా. పంట వస్తే అప్పులు కట్టుకోవచ్చని ఆశ పడ్డాను. భారీ వర్షాలతో 8 ఎకరాల పొలానికి వైరస్ వచ్చి పంట ఎర్రగా మారడం ప్రారంభించింది. దీని నివార ణకు మందులు వాడినా ఫలితం లేకుండా పోయిం ది. చెట్టుకు ఉన్న నాలుగైదు కాయలు మాత్రమే చేతికి వచ్చేలా కనపడు తోంది. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. పత్తి రైతును ప్రభు త్వం ఆదుకోవాలి. –నాగేశ్వరరావు, పత్తి రైతు, రామకృష్ణాపురం

అధిక తేమతోనే వైరస్



వరుసగా 15రోజులు వర్షాలు వచ్చి అధిక తేమ పొలంలో ఉండటంతో పత్తిని వైరస్ ఆశించింది. ఇది బాక్టీరియల్ బ్లైట్. దీనిని కోణీయ ఆకు మచ్చ తెగులు అని కూడా పిలు స్తారు. వైరస్ సోకిన పత్తి చెట్ల అవశేషాలను నాశనం చేస్తే దీన్ని నివారించవచ్చు. ఆమ్ల–డిలింట్ చేసిన విత్తనాలు వాడి, సరైన నీటిపారుదల పద్ధతులు నిర్వహిస్తే ఈ వైరస్ రాదు. – మహేంద్ర, ఏఓ, కృష్ణగిరి

అన్నదానానికి బయోమెట్రిక్

- నందవరం చౌడేశ్వరి దేవి ఆలయంలో కొత్త నిబంధన



నిత్యాన్నదాన సత్రంలో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్న దృశ్యం



చౌడాశ్వరిదేవి ఆలయ నిత్యాన్నదాన సత్రం

బనగానపల్లె రూరల్: నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ ఆవరణలోని నిత్యాన్నదాన సంస్థలో భక్తులు భోజనం చేయాలంటే ఇక నుంచి వేలి ముద్ర తప్పనిసరిగా వేయాల్సిందే. అమ్మవారి దర్శనం కోసం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి అమ్మవారి భక్తులు నిత్యం అధిక సంఖ్యలో వస్తుం టారు. వారి సౌకర్యార్థం ప్రతి రోజు నిత్యాన్నదాన సంస్థలో మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సుమారు 150 – 200 మంది భక్తులు భోజనం చేస్తారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయ అధికారులు అన్నదాన సంస్థలో భోజనం చేయాల్సిన భక్తులు వేలిముద్ర తప్పనిసరి చేశారు. అయితే వేలిముద్ర వేసేందుకు ఒక క్యూలో, ఆ తర్వాత భోజనం కోసం మరో క్యూలో వేచి ఉం డాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపి ల్లలు, అనారోగ్యంతో ఉన్న వారు మరిన్ని ఇబ్బం దులు పడుతున్నారు. జిల్లాలో చాలా ఆలయాల్లో అన్నదానం కొనసాగుతున్నా ఎక్కడ బయోమెట్రిక్ విధానం లేదు. భక్తుల విరాళంతో నిర్వహించే ఉచిత అన్నదానానికి బయోమెట్రిక్ విధానం ఎం దుకని భక్తులు పేర్కొంటున్నారు. కాగా ఈ విషయంపై ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివా సరెడ్డిని 'సాక్షి' వివరణ కోరంగా అన్నదాన కార్యక్ర మాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నుం చి బయోమెట్రిక్ విధానం అములులోకి తీసుకొ చ్చామన్నారు. కాగా ఈ విషయంలో అధికారులు పునరాలోచన చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డుపై సస్పెన్షన్ వేటు

కర్నూలు (క్రైం): జిల్లా పోలీసు శాఖలో పనిచే స్తున్న ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు, ఒక హోం గార్డుపై జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సస్పెన్షన్ వేటు వేశారు. గత నెల 30న 'వీడియోలు తీసి.. నిలువునా దోచేసి' శీర్షికన దోపిడీ ముఠాతో పోలీసులు చెట్టాపట్టాలు వేసుకొని తిరుగు తున్న వైనాన్ని 'సాక్షి' ప్రముఖంగా ప్రచురిం చింది. ఈ నేపథ్యంలోనే ముగ్గురు పోలీసులపై వేటు పడటం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీరాంప్రసాద్, తాలూకా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కాని స్టేబుల్ రాజేష్, ట్రాఫిక్ విభాగంలో పనిచే స్తున్న హోంగార్డు నబిషా క్రమశిక్షణ ఉల్లంఘ నకు పాల్పడ్డారు. ఇటీవల నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన దోపిడీ కేసులో ముద్దాయిలు నాగేంద్ర, రమేష్, మాలిక్‌లను రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ముద్దాయిలు చేసిన నేరాన్ని తెలిసి కూడా పైఅధికారులకు తెలియజేయకుండా పై ముగ్గురు పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం వహిం చారు. అలాగే జగన్నాథగట్టు రింగ్ రోడ్డు శివా రులో ప్రేమజంటలను బెదిరించి దోపిడీకి పాల్పడిన ఘటనలో ముద్దాయిలకు ఈ కానిస్టే బుళ్లు కూడా సహకరించినట్లు చర్చ జరు గుతోంది. దీంతో పై ముగ్గురు పోలీసు సిబ్బం దిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విధుల నుం చి తప్పిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా అనంత చతుర్థి వేడుకలు





అనంత పద్మనాభస్వామి సేవలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు , వేడుకను తిలకిస్తున్న భక్తులు

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో అనంత చతుర్దశి వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో పూజా మందిరంలో విశేషం గా పూజలు చేపట్టారు. స్వర్ణ మండపంలో అనం త పద్మనాభ స్వామిని కొలువుంచి వేద ఘోష శాస్త్రోక్తంగా నిర్వహించారు. అభిషేకాది పుష్పార్చ నలతో ఎంతో శోభాయమానంగా వేడుక చేప ట్టారు. అలాగే శుక్ర, ఆది వారాలు సెలవులు కలిసిరావడంతో శ్రీమఠంలో భక్తుల రద్దీ నెలకొం ది. భక్తుల దర్శనానికి 2 గంటల సమయం పట్టిం ది. తుంగాతీరం, మధ్వకారిడార్, అన్నపూర్ణ భో జనశాలతో భక్తుల కోలాహలం నెలకొంది.

24 ఏళ్లు టీడీపీ కోసం పని చేసిన గుర్తింపు లేదు

నంద్యాల(అర్బన్): 24 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ కోసం పని చేసిన సరైన గుర్తింపు, సాయం అందలేదని నంద్యాల పట్టణంలోని 1వ వార్డు హరిజనపేటకు చెందిన ఆ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు సీఎం రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యయప్రయాసకోర్చి ఎంతో మందికి పార్టీ సభ్యత్వం ఇప్పించానని చెప్పారు. శనివారం ఆయన సెల్ఫీ వీడియోలో మాట్లాడు తూ.. అధికారంలోకి వస్తే ఏదైనా సాధించుకుం దామని ఆశిస్తే నిరాశే ఎదురవుతుందన్నారు. వార్డు ఇన్‌చార్జి ఎవరినీ పట్టించుకోకుండా అం తా నాదే.. అన్ని పనులు మావే అనే కోణంలో ముందుకెళ్తున్నారన్నారు. మంత్రి ఫరూక్ సైతం పట్టించుకోవడం లేదని, తన బాధను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్‌లకు తెలిసేలా చేయాలని కోరారు.

నేడు సంపూర్ణ చంద్ర గ్రహణం

- మూతపడనున్న దేవాలయాలు

కర్నూలు కల్చరల్: భాద్రపద శుక్ల పౌర్ణమి ఆదివారం రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం రానుంది. ఈ గ్రహణం భారత దేశం అంతటా కనిపిస్తుందని పండి తులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి 9.56 గంటలకు గ్రహణం ప్రారంభమవుతుందని, 10.59 గంటలకు గ్రహణ మధ్యకాలమని, రాత్రి 1.26 గంటలకు గ్రహణ మోక్షకాలం ఉంటుందని తెలిపారు. మొత్తం 3.30 గం టల పాటు గ్రహణ పుణ్య కాలం ఉండనుంది చెప్పారు. ఇదిలా ఉండగా చంద్ర గ్రహణ నేపథ్యంలో జిల్లాలోని దేవాలయాలు ఆదివారం మూసి వేయను న్నారు. సోమవారం ఆలయాలను తెరచి శుద్ధి అనం తరం నిత్య పూజలతో యథాతథంగా దర్శనాలు కల్పిం చనున్నారు.

11న కళా ఉత్సవ్ పోటీలు

కర్నూలు(సిటీ): ఈనెల 11వ తేదీన బి.తాండ్రపాడులోని డైట్ కళాశాలలో సంగీతం, నృత్యం, నటన, చిత్రకళ తదితర 11 అంశాలపై జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ అయూబ్ హుసేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలుకు జిల్లాకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, ఎయి డెడ్, కేంద్రీయ విద్యాలయ, నవోదయ, రెసిడెన్షియల్, ఇతర మేనేజ్‌మెంట్ స్కూళ్లలో 9,10,11,12 తరగతులు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చునన్నారు. వివరాలకు కళాశాల అధ్యాకులు బి.మధు 8801761409 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు ఉల్లి వేలం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు రూ.1200 ధరతో కొనుగోలు చేసిన ఉల్లిని ఆదివారం వేలం వేయాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. మూడు రోజుల్లో 10 వేల క్వింటాళ్లకుపైగా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిం ది. వీటిని మార్కెట్ యార్డులోనే గోదాములో నిల్వ చేసింది. మార్కెట్‌లో తక్కువ ధరతో ఉల్లి లభిస్తుండటం తో ప్రభుత్వం రైతుబజార్లకు తరలిస్తున్న ఉల్లిని కొనేం దుకు వినియోగదారులు ముందుకు రావడం లేదు. చౌక ధరల దుకాణాల ద్వారా కిలో రూ.14 ప్రకారం పంపిణీ చేస్తామన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో మూడు రోజుల్లో కొనుగోలు చేసిన 1000 టన్నుల ఉల్లిని ఈ నెల 7వ తేదీ మార్కెట్ యార్డులోనే వేలం వేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గద్వాల రాజు తెలిపారు. హోటల్ యజమానులు, వ్యాపారులు వేలం పాటలో పాల్గొన వచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో ఓ విద్యార్థి ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీ పంలోని కోనాపురం గ్రామానికి చెందిన కార్తీక్‌రెడ్డి(21) తమ్మడపల్లెలోని తన బంధువుల వద్ద ఉంటూ నంద్యాల పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువు తున్నాడు. కాగా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్తీక్‌రెడ్డి కడుపునొప్పి భరించలేక ఆత్మ హత్యకు శనివారం ఉరేసుకుని పాల్పడ్డాడు. తల్లి, కుటుంబ సభ్యులు తమకు ఎలాంటి అనుమానాలు లేవ ని, కేసు వద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

- మరో ముగ్గురికి గాయాలు



వాహనంలో ఇరుక్కుపోయి మృతి చెందిన క్లీనర్ కురువ కుమార్ పీటర్

శిరివెళ్ల: ఆళ్లగడ్డ– నంద్యాల జాతీయ రహదారిపై గోవిందపల్లె– కాండ్ల పల్లె మధ్య కార్తికేయ గోడౌన్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐచర్ వాహన క్లీనర్ మృతి చెందాడు. ఆళ్లగడ్డ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో సడన్‌గా నిలపడంతో అదే సమ యంలో వెనుక వస్తున్న ఐచర్ వాహనం వేగంగా వచ్చి ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ఐచర్ వాహనం లో ఉన్న క్లీనర్ మహానంది మండలం బొల్లారానికి చెందిన కురువ కుమార్ పీటర్ (42)తీవ్రంగా గాయపడి ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెం దాడు. అదే గ్రామానికి చెందిన బాలాంజనేయులు, రాజోలి మల్లి, మహమ్మద్ బాషాలకు గాయాల య్యాయి. చికిత్స నిమిత్తంగా నంద్యాల ప్రభు త్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇరు వురు సంతానం ఉన్నారు. మృతుని భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిన్న పీరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళన బాటలో 104 ఉద్యోగులు



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

కర్నూలు (హాస్పిటల్): సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన చేయనున్నట్లు 104 అంబులెన్స్ ఉద్యోగులు చెప్పారు. ఈ మేరకు శనివారం సాయంత్రం డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన యాజ మాన్యం భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ వారు గతం నుంచి పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వేత నాలను తగ్గించిందన్నారు. దీనిపై వివరణ అడుగగా మూడు నెలల నుంచి సరైన సమాధానం ఇవ్వడం లేదని, యాజమాన్యాన్ని కలవనివ్వటం లేదన్నారు. తమ సమస్యలపై రాష్ట్ర ఉన్నతాధికారులకు అనేక విన తిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు. దీం తో 9వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే మరింత ఉధృతం చేస్తామన్నారు. తగ్గించిన జీతాలు బకాయి లతో సహా ఇవ్వాలని, ఉద్యోగులందరికీ వేతనాలు పెంచాలని, పూర్వ సంస్థ బకాయిలను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, డేటా ఎంట్రీ ఆప రేటర్లకు ఔట్ సోర్సింగ్ జీతాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశా మన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కళ్యాణి, ఇలి యాస్, హుసేన్, షరీఫ్, మంజుల, వినోద్, మల్లి కార్జున, మధు, అజం ఉన్నారు.

కారు బోల్తా



బోల్తా పడిన కారును పరిశీలిస్తున్న స్థానికులు

బేతంచెర్ల: హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో శనివారం జాతీయ రహదారిపై వెళ్తున్న కారు బోల్తా పడింది. కర్నూలు మండలం పందిపాడు గ్రామస్తులు మద్దిలేటయ్య క్షేత్రానికి కారులో వెళ్లి తిరిగి వస్తుండగా హెచ్ కొట్టాల గ్రామ సమీపాన ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒక్కరికి మాత్రమే స్వల్ప గాయాలు కాగా మరో ఆరుగురు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపి రిపీల్చుకున్నారు.

ఖాళీ కడుపుతో చదువుకునేదెట్టా!

- మధ్యాహ్న భోజన ఏజెన్సీనైనా మార్చండి.. టీసీలైనా ఇవ్వండి
- కొమ్మూరు కొట్టాల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల మొర



ఎంఈఓ సోమశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లి దండ్రులు

బేతంచెర్ల: మధ్యాహ్న భోజనం అరకొరగా పెడు తున్న బడిలో తమ పిల్లలు చదువుకోలేరని, టీసీలు ఇస్తే ఏదైనా బడిలో చేర్పిస్తామని కొమ్మూరు కొట్టాల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదం డ్రులు మొర పెట్టుకుంటున్నారు. ఏజెన్సీని మార్చాలని మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ శనివారం వారు ఎం ఈఓ సోమశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. భోజన ఏజెన్సీకి సంబంధించి విద్యార్థుల తల్లిదం డ్రులు సూచించిన వారిని కాకుండా అధికార పార్టీ నాయకులు తమకు నచ్చిన వారిని ఎక్కించుకొని రాజకీయం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించ కుండా గతంలో ఉన్న నాగలక్ష్మమ్మను తొలగించి ఆమె స్థానంలో కొమ్ము మహాలక్ష్మికి ఏజెన్సీని కట్టబె ట్టారన్నారు. ఆ ఏజెన్సీ వాళ్లు విద్యార్థులకు సరిగా అన్నం పెట్టకపోవడంతో అర్ధాకలితో చదువుకోలేక ఈ పాఠశాలలో 35 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం ఐదుగురు మాత్రమే బడికెళ్తున్నారు. దాదాపు రెండు నెలలుగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లకున్నా పట్టించుకునేవారు లేరు. జిల్లా కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేసినప్పటికీ రాజకీయ నాయ కుల ఒత్తిళ్లతో సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఓ వర్గం పెత్తనం చెలాయిస్తోందని, అయితే ఆ వర్గం పిల్లలను మాత్రం ఈ బడికి పంపడం లేదనే గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారి మాట వినక పోతే కేసులు పెట్టిస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఎంఈఓ సోమశేఖర్‌ను వివరణ కోరగా అందరూ కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు సంబంధించి దరఖాస్తు చేసుకుంటే.. టీసీల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసులతో భయబ్రాంతులకు గురి చేస్తున్నారు

మధ్యాహ్న భోజనం అరకొరగా పెడుతున్నారని పిల్లలు ఇంటికి వచ్చి చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం చూడటానికి తల్లిదండ్రులను పాఠశాల వద్దకు రానీయడం లేదు. మేము వెళ్లి చూడాలంటే పోలీసులతో భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. మా పిల్లలను ఏవిధంగా స్కూలుకు పంపించాలి. 30 మంది పిల్లలకు టీసీలు ఇస్తే వేరే పాఠశాలలో చేర్పించుకుంటాం. – మద్దిలేటి

జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి

మా పిల్లలకు మధ్యాహ్న భోజనం సక్రమంగా పెట్టడం లేదని ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనికి తోడు అధికార పార్టీ నాయకులు చెప్పినట్లుగా అధికారులు వ్యవహ రిస్తు న్నారు. మెజార్టీగా ఉన్న తల్లిదండ్రుల విన్నపాన్ని పట్టించుకోవడం లేదు. మా పిల్లలు సక్రమంగా పాఠశాలకు వెళ్లడం లేదు. జిల్లా అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి. – మదన గోపాలు, విద్యార్థి తండ్రి